క్లుప్తంగా

ఘనంగా శ్రావణ మాస పూజలు


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

సదుం: మండలంలోని శ్రీవారిపాద క్షేత్రంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

రాజనాలబండలో ప్రత్యేక పూజలు

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో చివరి శనివారం, ఆదివారం 13 గ్రామాల ప్రజలు కలిసి రాజనాలబండలో ఉట్లోత్సవం, తిరుణాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మొదటి శనివారం పూజలు చేయడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నేడు లయన్స్ క్లబ్ సమావేశం

సదుం: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు లయన్స్ క్లబ్ ఆఫ్ సదుం మణికంఠ సమావేశం నిర్వహించనున్నట్లు లయన్ సహదేవయ్య తెలిపారు. నూతన కార్యవర్గం ఎంపిక, సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చిస్తామని చెప్పారు.

ఎర్ర బాడ్జీలతో నిరసన

కుప్పం: ప్రభుత్వ స్థలాలను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఆర్టీసీ ఎస్‌ఎంయూ నాయకులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, బస్టాండు పరిధిలోని షాపింగ్ మాల్స్‌ను ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో జయపాల్, గణేష్, మునస్వామి, మునెప్ప పాల్గొన్నారు.

సదుం ఎంఈవో-1గా నటరాజన్

సదుం: మండల విద్యాశాఖ అధికారిగా డాక్టర్ నటరాజన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంఈవోగా సిద్ధరామయ్య పనిచేస్తున్నారు. నటరాజన్‌ను పలువురు టీచర్లు, ఎస్టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

గమనిస్తారా లేదంటే ప్రెస్‌నోట్ పెట్టమంటారా?

పలమనేరు: మమ్మల్ని గమనిస్తారా లేదంటే అధికారులకు ఫిర్యాదు చేసి పత్రికలకు ప్రెస్‌నోట్ ఇవ్వమంటారా అని కొందరు తమను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని స్కూళ్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పట్టణంలోని శ్రీవాణి చిల్డ్రన్స్ అకాడమీ, బృందావనం స్కూల్ గుర్తింపు, సౌకర్యాలపై కొందరు డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఇవన్నీ లేకుండా ఉండాలంటే తమను గమనించుకోవాలని ఫోన్ చేస్తున్నట్టు బాధితులు తెలిపారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

పాఠశాలకు డెస్కుల వితరణ


పాఠశాలకు డెస్కులు అందజేస్తున్న దాతలు

రొంపిచెర్ల: మండలంలోని బెస్తపల్లె ప్రాథమిక పాఠశాలకు శనివారం దాతలు కిషోర్, హిమబిందు, రెడ్డిమణికంఠ రూ.30 వేల విలువైన డెస్కులు వితరణ చేశారు. వారు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు గోగులపాటి జనార్ధన్ శెట్టి, సులోచనమ్మ జ్ఞాపకార్థం డెస్కులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఎంఈవో శ్రీనివాసులు, హెచ్‌ఎం చాంద్ బాషా, సీఆర్పీలు అనసూయ, కిరణ్, డీటీఈవో హరి, ఎంఐఎస్‌సీవో రవి పాల్గొన్నారు.

ఫోన్ ఇవ్వలేదని మహిళపై దాడి

చౌడేపల్లె: స్థానిక ప్రైవేట్ బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి కాల్ మాట్లాడుకోవడానికి ఫోన్ ఇవ్వలేదని మహిళపై వ్యక్తి దాడి చేశాడు. బాధితురాలి కథనం మేరకు.. మోటారువీధికి చెందిన చలపతి భార్య శిల్ప ప్రైవేటు బస్టాండు సమీపంలో రోడ్డు పక్కన పూల అంగడి నడుపుకుంటోంది. గోసలకురప్పల్లెకు చెందిన కన్నయ్య అక్కడికి వచ్చి వేరే వారికి కాల్ మాట్లాడుకోవడానికి ఫోన్ ఇవ్వాలని అడిగాడు. ఆమె నిరాకరించడంతో దాడి చేశాడు. బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాడి చేసిన వ్యక్తిపై చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష పోరాట సమితి డివిజనల్ కార్యదర్శి డాక్టర్ చంద్ర, మండల అధ్యక్షుడు వాసు డిమాండ్ చేశారు.

సుబ్రమణ్యం సేవలు అభినందనీయం


సుబ్రమణ్యంను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

పలమనేరు: మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై మేనేజర్‌గా నూజివీడుకు బదిలీ అయిన సుబ్రమణ్యం సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయనను శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

- విద్యార్థులకు తప్పని కష్టాలు
- లోపించిన పారిశుద్ధ్యం
- బాత్‌రూమ్‌లకు కరువైన తలుపులు
- పెచ్చులూడుతున్న గదుల పైకప్పు
- మంచినీటికీ దిక్కులేని వైనం

హాస్టళ్లలో వసతులు పూజ్యం


పలమనేరు బీసీ హాస్టల్‌లో పెచ్చులూడిన పైకప్పు

పలమనేరు/కుప్పం/పుంగనూరు/చౌడేపల్లె : బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం లోపించింది. దోమలు విజృంభించి పగలు, రాత్రి తేడా లేకుండా చుట్టుముడుతున్నాయి. బాత్ రూములకు తలుపులు లేవు. గదుల పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. కొన్ని హాస్టళ్లలో మంచి నీరు సైతం కరువైంది. ఇటీవల ఎస్సీ హాస్టళ్లలో వసతుల కల్పనకు నిధులు అందడంతో వాటి పరిస్థితి మెరుగైంది. పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లోని పలు హాస్టళ్లలోని పరిస్థితులపై సాక్షి బుధవారం రాత్రి పరిశీలించింది.

దారి సమస్య

పలమనేరు పట్టణం సమీపంలోని కొలమాసనపల్లి హాస్టల్‌కు దారి సమస్య వుంది. గ్రామానికి దూరంగా ఉన్న ఈ హాస్టల్‌కు పిల్లలు వెళ్లాలంటే దారి లేదు. వర్షం కారణంగా దారి మొత్తం చిత్తడిగా మారింది. కనీసం నడిచి వెళ్లడానికి సైతం వీలుగాని పరిస్థితి. గుడియాత్తం రోడ్డులోని బీసీ హాస్టల్‌లో మంచి నీరు కరువైంది. హాస్టల్ భవనంపై నిర్మించిన నీటితొట్టె కాలంచెల్లి నీరు లీకవుతోంది. పాచిపట్టిన నీటినే పిల్లలు తాగాల్సి వస్తోంది. బాత్‌రూమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పలు గదుల్లో పైకప్పు పెచ్చులూడి కిందపడుతోంది. పలమనేరు పట్టణంలోని బీసీ హాస్టల్‌లో మైనర్ రిపేర్లకు రూ.7 లక్షలు మంజూరైంది. ఈ పనులను దక్కించుకున్న స్థానిక పచ్చ కాంట్రాక్టర్ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. నీటి తొట్టికు బదులు ప్లాస్టిక్ ట్యాంకునైనా పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

సీఎం నియోజకవర్గంలోనూ అంతే..


కుప్పం హాస్టల్ ఎదుట వున్న పశువుల పాక

సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలోనూ వసతులు కరువయ్యాయి. ఇక్కడి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో 65 మందికి పైగా విద్యార్థులు వసతి పొందేవారు. ప్రస్తుతం బీసీ హాస్టల్‌లో 25 మంది, ఎస్సీ హాస్టల్‌లో 42 మంది మాత్రమే ఉంటున్నారు. మునుస్వామిపురంలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో స్నానపు గదులకు నీటి సరఫరా లేదు. స్నానపు గదులు, మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. హాస్టల్ నుంచి పాఠశాలలకు వెళ్లేందుకు దారి సౌకర్యం లేదు.

కరెంట్‌పోతే చీకటిలోనే...

నియోజకవర్గంలోని అన్ని హాస్టళ్లలోనూ రాత్రిళ్లు కరెంట్ పోతే పిల్లలు చీకటిలో ఉండాల్సి వస్తోంది. కొన్నింటి వద్ద ఆరుబయట బ్యాటరీ బల్బులు ఏర్పాటు చేశారు. వీకోటలోని హాస్టళ్లల్లో బాత్‌రూమ్‌లకు తలుపులు కూడా లేవు. పిల్లలు ఆరుబయటే మలమూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి. బాలికల హాస్టళ్లలో పారిశుద్ధ్యం లోపించింది. ప్రహరీగోడ తక్కువ ఎత్తులో ఉండడంతో ఆకతాయిల తాకిడి తప్పడం లేదు. బైరెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో డైనింగ్ హాలు పెకప్పు పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో పిల్లలకు మూడు పూటలా ఆరుబయట భోజనాన్ని పెడుతున్నారు. ఇక వర్షం వస్తే వీరికి వరండాలే దిక్కు. పిల్లలకు రోజూ చన్నీటి స్నానమే దిక్కు.


బురదమయమైన కొలమాసనపల్లి హాస్టల్ రోడ్డు


వీకోట బాలికల హాస్టల్‌లో ఆరుబయట చీకటిలోనే చదువుకుంటున్న పిల్లలు

ప్రతిపాదనలకే పరిమితం

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హాస్టళ్ల అభివృద్ధి కోసం కడా ప్రాజెక్టు కింద రూ.15 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. బీసీ, ఎస్సీ హాస్టళ్ల భవనాలకు పైపైన రంగులు వేసి చేతులు దులుపుకున్నారు.
- పుంగనూరు పట్టణంలోని దోబీ కాలనీలో బీసీ హాస్టల్‌లో 70 మంది విద్యార్థులు వున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించింది. విద్యార్థులకు అవసరమైన బెడ్‌షీట్లు, మ్యాట్లు సరఫరా చేయలేదు. అలాగే ఎస్సీ హాస్టల్‌లో 111 మంది వున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించినా వాటర్ హీటర్లు లేకపోవడంతో పిల్లలు చన్నీటి స్నానం చేస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించింది. ఇక్కడ కుక్కల బెడద ఎక్కువగా వుంది.
- చౌడేపల్లె బీసీ బాలుర వసతి గృహంలో 38 మంది విద్యార్థులు వున్నారు. దారి సౌకర్యంలేకపోవడంతో హాస్టల్‌కు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. హాస్టల్‌లో లైట్లు, ఫ్యాన్లు పని చేయడంలేదు. కిటికీలకు అమర్చిన మెస్ దెబ్బతినడంతో దోమలు బెడద ఎక్కువగా వుంది. చేతులు కడుక్కొనేందుకు ఏర్పాటుచేసిన కొళాయిల నీరు తాగాల్సి వస్తోంది. నీటి కలుషితం కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.


కుప్పం నేలపైనే అన్నం తింటున్న పిల్లలు

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం

బీసీ హాస్టల్‌లోని పిల్లల స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం.

– వెంకటరమణ, బీసీ హాస్టల్ వార్డెన్, పుంగనూరు

మాజీ మంత్రిని కలిసిన జెడ్పీ చైర్మన్


మాజీ మంత్రి పెద్దిరెడ్డితో జెడ్పీ చైర్మన్

వి.కోట : మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పరిషత్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు శ్రీనివాసులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● ఆశీర్వాదం



రొంపిచెర్ల: పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన డాక్టర్ మేకల మల్లికార్జున రెడ్డి కుమార్తె శ్రేయ అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం పోలిమేరపల్లెకు చెందిన పోలిశెట్టి శ్రీనివాసులురెడ్డి కుమారుడు జగదీశ్వర్ రెడ్డి వివాహం రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని వీఎంఆర్ కల్యాణ మండపంలో శనివారం జరిగింది. ఇందులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పులిచెర్ల, రొంపిచెర్ల ఎంపీపీలు సురేంద్రనాథరెడ్డి, చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎం.ఆర్.సీ.రెడ్డి, నాథముని రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చెంచురెడ్డి, నిరంజన్ రెడ్డి, ఆనందరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి గన్‌మెన్ సస్పెన్షన్ తగదు


కమలాపురం శ్రీదేవిరెడ్డి

రొంపిచెర్ల: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మెన్ కాలేషాను సస్పెండ్ చేయడం తగదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కమలాపురం శ్రీదేవిరెడ్డి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలులో కలవడానికి వెళ్లిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సాయం చేశారని గన్‌మెన్‌ను మూడు నెలలు సస్పెండ్ చేయడం సబబు కాదన్నారు. ఏపీలో పోలీసు అధికారులు కూటమి నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పెద్దిరెడ్డి చేతికి ఆపరేషన్ చేయించుకున్నారని, బరువు మోయలేని స్థితిలో వున్న ఆయనకు సాయం చేస్తే తప్పు ఎలా అవుతుందన్నారు. తండ్రి వయస్సులో ఉన్న పెద్దిరెడ్డికి గన్‌మెన్ సాయం చేయడం నేరమా? అని ప్రశ్నించారు. చాలా మంది పోలీసు అధికారులు తమ ఇళ్లలో హోమ్‌గార్డులు, పోలీసు సిబ్బందితో పనులు చేయించుకోవడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పత్తిపాటి పూల్లారావు సతీమణి పుట్టిన రోజు వేడుకలను పోలీసులు ఎలా చేశారని గుర్తు చేశారు. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, చట్టవిరుద్ధంగా పనిచేస్తున్న అధికారులపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మార్కెట్ కమిటీ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ముంగరవారిపల్లెకు చెందిన ఎం.నారాయణరెడ్డి (63) బైక్‌లో రొంపిచెర్ల క్రాస్ వైపు వెళుతున్నాడు. పెట్రోల్ బంక్ ఎదుట రొంపిచెర్ల క్రాస్ నుంచి రొంపిచెర్లకు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డిని స్థానికులు 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం ఢీకొని..

పుంగనూరు: మదనపల్లె రోడ్డులో శనివారం ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. బడిగిరెడ్డిపల్లెకు చెందిన కదిరప్ప కుమారుడు ఆంజప్ప(55) బైక్‌లో పుంగనూరు నుంచి మదనపల్లెకు వెళ్తున్నాడు. మదనపల్లె నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. హరిహరసుతన్ సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా సెప్టెంబర్ 4వ తేదీ వరకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

వి.కోట: క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని పలమనేరు డివిజన్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం ఓగు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. గళ్ల పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం ఏఎస్‌ఎంలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకన్నా ఎక్కువ రోజులు దగ్గు వుండడం, రాత్రిళ్లు చెమటలు పట్టడం, చాతీలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, అలసట తదితర లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు డాక్టర్ మాధవి, డాక్టర్ విజయ్‌కాంత్, డాక్టర్ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్‌గా మణికంఠ



పుంగనూరు: పట్టణానికి చెందిన మణికంఠను కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్‌గా నియమిస్తూ సర్వశిక్షా అభియాన్ అధికారులు శనివారం ఉత్తర్వులు పంపారు. విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు మణికంఠ చేస్తున్న సేవలను గుర్తించి కౌన్సిలర్‌గా నియమించినట్టు పేర్కొన్నారు.

అక్రమాలపై బహిరంగ విచారణకు సిద్ధం

పలమనేరు: పలమనేరు ఎస్టీవో కార్యాలయంలో అక్రమాలు జరిగాయని ఒక సంఘం నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారని, దీనిపై తాము బహిరంగ విచారణకు సిద్ధమని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు తెలిపారు. స్థానిక ఎస్టీవోపై కొందరు కావాలనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, అలాంటి వారు తమ చిరునామా కూడా రాయకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. దీనిపై తాము ఎలాంటి విచారణకైనా సిద్ధమని పేర్కొన్నారు.

104 వాహనం సేవలను సద్వినియోగం చేసుకోవాలి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు) : ప్రభుత్వం 104 వాహనం ద్వారా గ్రామాల్లో అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం వంకాయలపాటివారిపల్లెలో 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు జ్వరం, దగ్గు, మధుమేహం, గుండె జబ్బులు, బీపీ తదితర రోగాలకు పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జబీన్ తాజ్, సుమిత్ర, కళారంజని, దివ్య, మురళి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

బైరెడ్డిపల్లె : పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర తెలిపారు. ఆయన శనివారం కమ్మనపల్లె ఆదర్శ, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. వంటగదులను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ప్రిన్సిపాల్ అనిత, స్వరూప పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ


మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు డాక్టర్ తమీమ్ తెలిపారు. ఆయన శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 100 కొబ్బరి మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ వాతావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. దాన్ని నివారించాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈవో శ్రీనాథ్‌రెడ్డి, బాలగురునాథ్, సురేంద్రగౌడు, గిరిబాబు, ఇంద్రేష్, లాభూరాం, నాగరాజేంద్ర, శంకర్, తుకారాం, ధీరజ్ పాల్గొన్నారు.

అక్రమ క్వారీ పనులు నిలిపివేయాలి

బైరెడ్డిపల్లె : తీర్థం గడ్డూరు సమీపంలో జరుగుతున్న అక్రమ క్వారీ పనులను నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు శనివారం జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ క్వారీ యజమానులు రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కుమ్మక్కై రైతుల అనుమతి లేకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు. క్వారీలో పేలుళ్ల శబ్దాలకు చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. పనులను అడ్డుకుని న్యాయం చేయాలని కోరారు.

చిన్న తిరుపతిలో తిరుమల లడ్డూలకు డిమాండ్


తిరుమల లడ్డూలకోసం క్యూకట్టిన భక్తులు

పలమనేరు: పలమనేరు సమీపంలోని కీలపట్ల కోనేటి రాయుని ఆలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందింది. తిరుమలలో వున్న స్వామి విగ్రహంలాగే ఇక్కడా స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ ఆలయం టీటీడీ నిర్వహణలో ఉంది. ఆలయానికి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా శనివారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందులోనూ శ్రావణ శనివారాలు రావడంతో భక్తులు పోటెత్తారు. ఇక్కడ ప్రతి శనివారమూ తిరుమల లడ్డూలు అందజేస్తున్నారు. తిరుమలకు వెళ్లలేని వారు ఇక్కడ స్వామి వారిని దర్శించుకుని తిరుమల లడ్డూ తీసుకెళుతుంటారు. ఈ శనివారం స్థానిక ఆలయంలో ఉదయం 8 గంటలకే లడ్డూల కోసం జనం క్యూకట్టారు. లడ్డూలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తగినన్ని ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అదేవిధంగా ఈ ఆలయానికి వెళ్లే దారిని మరింత అభివృద్ధి చేయడంతోపాటు పలమనేరు నుంచి ఆర్టీసీ బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ


బాలేపల్లిలో చెత్త సేకరణ పనులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శారదా దేవి

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు, బాలేపల్లి గ్రామాల్లో చేస్తున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఎక్కడా పారిశుద్ధ్య నిర్వహణ లోపాలు లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఆరేళ్లలోపు పిల్లలందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి ఆధార్ కార్డు కోసం వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

గంగవరం: కార్గిల్ యుద్ధంలో మన దేశ సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ తెలిపారు. డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో అనేక మంది సైనికులు ప్రాణాలను త్యాగం చేశారని వివరించారు. పాకిస్తాన్ మూకలను మట్టి కరిపించినట్టు తెలిపారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్.రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం


మాజీ సైనికులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు

పుంగనూరు: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం పలువురు మాజీ సైనికులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో సేవలు అందించిన మండెం మహేశ్వర, సుబేదార్ రమేష్, జి.కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శరవణకుమార్ పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు సర్వే

పలమనేరు: మున్సిపాలిటీలో తాజాగా నిర్మించిన ఇళ్లు, సవరించిన ఆస్తి పన్ను వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించే కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభించినట్టు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు.

పొగాకు విక్రయిస్తే జరిమానా

బైరెడ్డిపల్లె : పాఠశాలలకు వంద మీటర్ల లోపు పొగాకు విక్రయిస్తే జరిమానా తప్పదని ఎస్‌ఐ పరశురాముడు హెచ్చరించారు. ఆయన శనివారం బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న దుకాణాల్లో తనిఖీ చేశారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఇన్‌చార్జి డాక్టర్

సాక్షి ఎఫెక్ట్..

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేటలో వున్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఇన్‌చార్జి డాక్టర్‌గా కిరణ్మయిని నియమించారు. సాక్షి దినపత్రికలో డాక్టర్ లేక.. వైద్యం అందక అన్న శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు పీహెచ్‌సీకి డాక్టర్‌ను నియమించారు. ఆమె శనివారం రోగులకు వైద్య సేవలు అందించారు.